ఆగంతుకుడు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

సంధ్యచీకటి, ముసుగవేసుకు వస్తోంది.

'అబ్బ! చీకటిపడిపోతోంది...' అమృతవల్లి ఏదో చెప్పబోతోంది. శ్రీధర్ ఇంకా రొప్పుతూనే వున్నాడు. తల గట్టిగా పట్టుకున్నాడు. నువ్వేమి మాట్లాడ వద్దన్నట్లు తల గట్టిగా త్రిప్పాడు. ఆమె పెదిమలు తడబడ్డాయి. కళ్లు గట్టిగా మూసుకుంది. రెండు చేతులు మొహాన పెట్టుకుని ఒక్క క్షణం గజగజ వణికింది.

'నన్ను పడుకోనీ ... కాసేపు మాట్లాడక... నిన్నే...ఊరికే వేధించక...' శ్రీధర్ బరువుగా లేచి లోపలకు వెళ్లాడు.

'నేనేం చేశానని నామీద మీకు అంత అక్కసు, కోపము...చెప్పండి...నన్ను ఇట్లా హింసపెట్టకండి..' అమృతవల్లి పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోవటానికి ప్రయత్నం చేస్తోంది.

'అబ్బ! కాసేపు మాట్లాడక...నన్ను పడుకోనీ' ఎంతో ఆవేశంతో అన్నాడు.

'నా మొహం చూస్తుంటేనే మీరు ఇదయిపోతారు. నేనేం పాపం చేశానని...' ఇంకా ఏమేమిటో భర్తకు వినిపించనంత సన్నగా గొణిగింది.

'ఊఁ...' అంటూ మూలిగి పడుకున్నాడు శ్రీధర్. అట్లాగే సన్నగా మాట్లాడుతూనే వుంది. శ్రీధర్ మాత్రం మెదలకండా పడుకుని వున్నాడు.

ఓరకంటితో తలుపుల సందుల్లోంచి కళ్లు పెద్దవి చేసుకొని తీక్ష్ణంగా ఒకాయన చూస్తూ నిలబడ్డాడు. కాస్తంతగాలికే తలుపులు రెండూ చెరోవైపుకు జారుకున్నాయి. ఆవ్యక్తి తడబడుతూ చూస్తూ నిలబడిపోయాడు. అమృతవల్లి కళ్ళు రెండు ఆవ్యక్తిమీద గభాలున నిలిచిపోయినాయి. క్షణంలో పెద్ద భయం వేసింది. అపరిచిత వ్యక్తిని అంత హఠాత్తుగా చూసేటప్పటికి ఒళ్లు ఝల్లుమన్నది. మీరెవరని అడుగుదామనుకుని కూడా మాట పైకి పెగిలిరాలేక చప్పబడి వూరుకుంది. అంతకంటె కూడా ఆవ్యక్తి భయపడిపోయినట్లు కళ్లు అటూఇటూ గబగబ తిప్పేస్తున్నాడు.

అమృతవల్లి గాభరాగా బరువుగా మెల్లిగాలేచి నిలబడింది. ఏమి మాట్లాడాలో అర్థంకాలేదు. దీపం పెద్దది చేసింది. చేతులు గజగజలాడుతున్నాయి. భర్త తలమీద నిమిరింది. శ్రీధర్ చివాలున ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. కళ్లార్పుతూ చూస్తుంటే మసకమసకగా ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని చూడగలిగాడు. కళ్లుగట్టిగా నలుపుకుని బాగా చూశాడు. ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాడు.

'ఎవరుమీరు?' అన్నాడు.

చప్పున బెడ్డింగు క్రిందపెట్టేసి, కళ్ళు రెండు పెద్దవి చేసుకుని చిరునవ్వుమొహం పెట్టాడు ఆవ్యక్తి.

ఎవరుమీరు అన్నట్లు కళ్ళు తిప్పాడు శ్రీధర్.

'నా పేరు చంద్రం. మాది చాలా పల్లెటూరు లెండి ... అసలు నేను ఇప్పుడు ఇక్కడికి రావాలిసిందా! ఎప్పుడో పొద్దునే ఊడిపడాలసినవాణ్ని. అయితే యేం! ఈ రైళ్లు ఏనాడు సరియైన టైముకు వచ్చాయని! ఏమయితేనేమిలెండి. సరియైన ఇంటికి వచ్చాను. అసలు విషయం చెప్పటం మరిచేపోయినా. రేపు నేను ఉద్యోగంలో జాయను అవ్వాలి. అంటే ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వచ్చాను. నన్ను ఇంటర్వ్యూ చేసినవాడు ఎవ్వరూ కూడా నన్ను సెలెక్టు చెయ్యకండా తప్పించుకోలేదు. అయితే ఏం ప్రయోజనం? నాకు ఒక్క వుద్యోగమూ నచ్చదు. ఇంతకీ ముఖ్యమైన విషయము ఏమిటంటే నాకు ఈ ఉద్యోగప్రాప్తి వుంది. ఇక్కడికి వచ్చేశాను. ఇక్కడ ఒక భాగం ఖాళీగా వుందని తెలిసింది. ఎట్లాగంటే, టులెట్ బోర్డు చూశానులెండి! మీరు నన్ను ముందుగా ఏ ప్రశ్నలు వెయ్యకండానే అతిముఖ్యమయిన రెండు విషయాలు చెప్పేస్తాను. నాకు పెళ్ళయింది; మొదటిది. నాకో పిల్లాడు కూడాను; రెండోది. ఈ పోర్షను నాకు ఇచ్చెయ్యండి. అద్దె విషయము నాకేమీ ఫరవాలేదు లెండి...!' ఏమంటారు అన్నట్లు శ్రీధర్ మొహంలోకి చూశాడు.

శ్రీధర్ అవుతే చిత్తరువులాగ అట్లాగే నిలబడిపోయాడు. అమృతవల్లి నడ్డిన చెయ్యిపెట్టుకుని అదే. పనిగా చెవులు అప్పగించుకుని నిలబడిపోయింది

ఆ వ్యక్తి మాట్లాడటం మానేసేటప్పటికి తనకు స్పృహ వచ్చినట్లు అనిపించింది. భర్తవైపుకు చూసింది ఇట్టే. ఇంకా ఆయన, ఆ వ్యక్తిమీదనుంచి దృష్టిని మరల్చనే లేదు. భర్త కళ్ళల్లోనుంచి ఆ వ్యక్తిని చూసింది. ఆయన చిరునవ్వు నవ్వుకున్నాడు.

'ఒక్కటే గది...'అని శ్రీధర్ మొదలుపెట్టాడు.

'అయితే ఏం!...' ఆయన ముంగుకు అతిచొరవగా ఒక అడుగువేశాడు, తొంగి చూస్తున్నాడు.

'ఇదేగా, భేషుగ్గా వుంది! మేము ఎంతలోనైనా సరిపుచ్చుకుంటాం. ఎవరితోనైనా సర్దుకుపోతాం. అసలు మావంతా విచిత్ర ప్రకృతి లెండి. మేము ఒకళ్ళతో పోట్లాడేవాళ్ళం కాదు. మీకు తెలీదేమో! నిజం చెప్పకూడదు కానీండి, మా ఆవిడ నాకంటె చాలా తెలివికలది. ఎక్కడ నాలుగురోజులున్నా సరే అబ్బ! అంత ఉత్తమయిల్లాలు లేదమ్మా అని అనిపించుకుని బైటపడాల్సిందే! నా సంగతి సరేసరి! నోటిలో నాలిక లేనివాణ్ని. మరిచేపోయినా చెప్పటం. నేను కొంచెంగా రచిస్తాను కూడా అంటే రచయితనన్నమాట ఈ మధ్యనే ఒక పుస్తకంకూడా అచ్చువేయించాను. నా విషయాలు నేను చెప్పకోకూడదు లెండి. నాలుగు రోజు లాగుతే మీకే తెలుస్తాయి. నిజంపటితే నాలుగు రోజులుకూడా ఆగక్కర్లా. నేను మీకు అనవసరంగా శ్రమయిస్తున్నాననుకుంటూ. కాని మీ ఇరుగుపొరుగువారి విషయము తెలుసుకునే హక్కు మీకు పూర్తిగా వుంది...ఏమంటారు...' ఎంతో ధీమాగా కళ్లు తిప్పాడు.

శ్రీధర్ మారుమాటాడకండా గదిలోపలికి తీసుకు వెళ్ళాడు. వెనకాలే చంద్రం ఒక చేతిలో బెడ్డింగు, రెండోచేత్తో పెట్టె పట్టుకుని చకచక నడిచాడు.

బెడ్డింగు ఇట్టే పరిచేశాడు. శ్రీధర్ కొంచెం వెనక్కు తగ్గాడు. చంద్రం నిలువునా పడుకుని దుప్పటి కప్పేసుకున్నాడు.

శ్రీధర్ ఆలోచనలన్నీ పటాపంచలై పోయినాయి. ఆయన మనస్సంతా చంద్రంమీదే కేంద్రీకరింపబడింది. అమృతవల్లి అసలు తన అస్తిత్వాన్నే మరిచేపోయినట్లుంది. ఏమిటో వింతగా చంద్రం చెప్పినవన్నీ విన్నది. ఆశ్చర్యంగా ఆయనవంక చూసింది.

శ్రీధర్ వెళ్ళి గదిగుమ్మంముందు తారటలాడుతున్నాడు. చంద్రం ఉన్నట్టుండి చివాలునలేచి దొడ్డిగుమ్మందగ్గరకు వెళ్లాడు. బొక్కెనలో నీళ్ళన్నీ ఖాళీ చేసి వచ్చాడు. బట్టలు మార్చుకుని ఇట్లే మళ్ళీ పడుకున్నాడు. నడుముపట్టుకుంటున్నాడు. అటూ ఇటూ వత్తిగిలుతున్నాడు. నానా అవస్థ పడుతున్నాడు.

శ్రీధర్ ఇవతల గదిలో తెగ ఆరాటపడుతున్నాడు. మథన తెగటం లేదు. శ్రీధర్ మొహంలో ఎంతో పెద్ద మార్పు వచ్చినట్లనిపించింది. చంద్రం గదిలోకి వెళ్లాడు. ఆయన మసులుతున్నాడు కళ్లు మూసుకుని.

'మీ భోజనం......' అంటూ శ్రీధర్ సగంలో ఆపేశాడు.

'ఇవ్వాళ సోమవారం......అన్నాడు చంద్రం హఠాత్తుగా. శ్రీధర్ గదిలోంచి వెళ్ళిపోయాడు అనుకుని చంద్రం కళ్లుతెరిచాడు. తప్పని సరిగా నవ్వుతూ బెడ్డింగుమీద నుంచి లేవబోయాడు.

'ఫరవాలేదు పడుకోండి...' అంటూనే శ్రీధర్ తలుపులు రెండూ వేసేశాడు.

వెనకాలే అమృతవల్లి నిలబడివుంది. ఆమెను చూడంగానే మళ్లీ శ్రీధర్ మనస్సంతా చెదిరిపోయినట్లయింది. మొహం చిటచిటలాడించుకున్నాడు. పెదిమలు రెండూ గట్టిగా కదిలించేశాడు. అమృతవల్లి చిన్నబుచ్చుకుంది. అయితే బలవంతంగా నవ్వును తెచ్చుకుంటూ 'వడ్డించమంటారా?' అన్నది.

'ఏమిటది?' అని కసిరాడు శ్రీధర్.

'అన్నం...' ఎంతో నీటుగా అన్నది. కొరకొరచూశాడు. కాని సమాధానం ఏమీ ఇవ్వలేదు.

అమృతవల్లి నవ్వుకుంటూ లోపలికివెళ్లిపోయింది.

'రండి' అంటూ లోపల్నుంచి పిలిచింది. శ్రీధర్ చాలాసేపు ఘర్షణ పడ్డాడు. ఏమనుకున్నాడో ఏమో మెల్లిగా భోజనానికి వెళ్లాడు.

అమృతవల్లికి ఎన్నడూలేని సంతోషం వచ్చింది. వడ్డిస్తున్న కాసేపు కూడా తన్మయత్వం పొందింది. తాను కాపరానికి వచ్చిన తర్వాత ఇంత సంతోషము ఎన్నడూ కూడా కలగలేదు. కారణం ఏమిటో తెలీదు. ఎప్పుడూ కూడా తన భర్త తనను ఆప్యాయంగా పిలవటంకాని ప్రేమగా చూడటంగాని జరగలేదు. కారణం ఏమిటో తెలీదు. తనవలన ఏమైనా లోపం జరిగిందేమోనని నిత్యమూ ఆలోచిస్తూ వుంటుంది. అలాంటిదేమీ కనిపించదు. అలాంటప్పుడు తన మీద భర్తకు అంతకోపం ఎందుకో అర్థంకాదు. ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా భర్తప్రేమను పొందుదామని

ప్రయత్నం చేసిందికాని సఫలురాలు కాలేకపోయింది. శ్రీధర్‌కు చెడ్డ చిరాకు, కారణంలేని కోపం, అర్థంలేని ఆవేశం. ఇంతకీ ఆమె అందంగా లేదని ఒక కారణం మాత్రం చెపుతూవుంటాడు. ఈ మాట అన్నప్పుడల్లా ఆమె చాలా క్రుంగిపోతుంది. మానసికంగా విపరీతమైన బాధ పడుతుంది. నిత్యఘర్షణ ఇద్దరి మధ్య నడుస్తూనే వుంటుంది.

ఇవ్వాళ ఏమిటో అమృతవల్లి మొహం విప్పారినట్లనిపించింది. తన భర్తకు తనమీద అనురాగం ఏర్పడిందని మురిసిపోతోంది. ముభావంగా కూర్చున్నాడు. భార్య ఎన్నిసార్లు పిలిచినా సమాధానం చెప్పనూ లేదు. ఒక మాటకూడా మాట్లాడనూ లేదు. తన సంతృప్తికోసం అవీ ఇవీ మాట్లాడుకుంటూనే వుంది.

శ్రీధర్ తమాషాగా నవ్వుకుంటూ లేచాడు. వెను వెంట అమృతవల్లి లేచి నిలబడింది. వెనక్కు ఒకసారి చూసి గదిలోకి వెళ్ళిపోయాడు. తాను గదిలోకి నడిచింది.

'ఏమండీ మిమ్మల్ని ఒక్కమాట అడుగుతాను.'

శ్రీధర్ చప్పున కళ్లు పెద్దవిచేసుకుని భార్య మొహంలోకి విడ్డూరంగా చూశాడు.

'ఏమండీ...' అన్నది మళ్లీ ప్రాధేయపడుతూ.

'నామీద ఎందుకండీ అంతకోపం ... నేనేం చేశానని... నామొహం చూస్తేనే మీకు...' మాటలు తడబడాయి.

'ఊఁ...'అంటూనే మంచంమీద పడుకున్నాడు శ్రీధర్. మంచందగ్గరగా వచ్చి నిలబడింది. మళ్లీ భర్తను పిలవటం మొదలుపెట్టింది. ఆయన చలనంలేకుండా పడుకుని వున్నాడు.

'నేనీ విధంగా ఈఇంట్లో ఇంక ఒక్కక్షణం ఉండలేను...' బాగా అక్కసుగా అంది.

'మీరు నన్ను ఈవిధంగా హింసపెట్టటం...'

శ్రీధర్ చివాలున దుప్పటి తీసి లేచాడు.

'నీకు కాదూ చెప్పేది, వెళ్లమన్నా! ఎందుకు ఇక్కడ నిలబడ్డావు? చెపుతుంది నీకు కాదా అంట! ... నిన్నే!...' హుంకరించాడు.

మొహాన చేతులుపెట్టుకుని వెనక్కుతిరిగింది.

శ్రీధర్ ఇట్టే నిద్రపోయాడు. ఆమె మాత్రం తన జీవితాన్నిగురించి రకరకాలుగా ఆలోచించుకుంటూ చాలా ప్రొద్దుపోయేవరకు కూర్చునే వుంది. ఆ ఆలోచనల్లో మధ్యమధ్య చంద్రం వచ్చి కొంచెం మనశ్శాంతి కలిగిస్తున్నాడు. ఎందుకనో తెలీదు. చంద్రం వచ్చినప్పటినుంచి శ్రీధర్ మొహంలో మార్పువచ్చినట్టే తనలోకూడా ఏదో మార్పు వచ్చిందని ఆవేశపడుతోంది. ఏవిధమైనమార్పో అర్థం కావటంలేదు. మొత్తం మీద అతను ఈఇంట్లో అడుగుపెట్టినప్పటినుంచి అదో రకమైనభావను ఆమె మనస్సులోకి వచ్చి కూర్చొంది. ఆమె మనస్తత్వం ఇట్టే మారిపోయినట్లనిపించింది. చంద్రం మాట్లాడుతున్నంతసేపు ఎంతోహాయిగా వింటోంది. ఈప్రపంచమే మరిచిపోయినట్లనిపించింది. అతనిమాటల్లో అంత ఆకర్షణ కనిపించింది. కాసేపు చంద్రాన్నిగురించి ఊహించుకుంటుంటే చప్పగా తెల్లారిపోయింది.

అమృతవల్లి కళ్లు రెండూ ఎర్రబడ్డాయి. ఒళ్ళు బద్ధకంగావుంది. తెల్లారినాకూడా ప్రక్కమీదనుంచి లేవ బుద్ధిపుట్టటం లేదు. ఇంకా ఆలోచిస్తూనే వుంది. అప్రయత్నంగా లేచింది. ఇంకా భర్త నిద్రపోతూనే వున్నాడు. ప్రక్కగదిలో చంద్రం గాఢంగా నిద్రపోతూనే వున్నాడు. పాపం ప్రయాణంలో ఎంత అలసిపోయాడో అనుకుంది. మెల్లిగా గదివైపుకు వెళదామనుకుంది. మళ్లీ ఎందుకనో తటపటాయించి వూరుకుంది.

శ్రీధర్ నిద్రలేచేటప్పటికి కాఫీ తయారుచేసి పెట్టింది. ఆయన ఇంకా లేవలేదా అన్నట్లు గది దగ్గరకు వెళ్ళాడు. ఇంకా చంద్రం ముసుగుపెట్టుకునే వున్నాడు. పాపం ప్రయాణంలో ఎంత అలసిపోయాడో అనుకున్నాడు. భర్త మొహంలోకి చూసి, అమృతవల్లి పెద్ద నిట్టూర్పు విడిచింది. ఈసారి ఏమిటో మాట్లాడాలని ప్రయత్నం చేస్తున్నట్లు కనపడ్డాడే కాని ఒక్కమాటకూడా మాట్లాడలేదు. అమృతవల్లి అయితే అదుర్దాగా భర్త ఏమంటాడా అని ఎదురుచూస్తూనే వుంది.

గదితలుపులు తీశాడు చంద్రం. శ్రీధర్ 'గుడ్ మార్నింగ్!' అన్నాడు. ఆయన చిఱునవ్వుతో స్వీకరించాడు. శ్రీధర్ ముంగుకువెళ్లిపోతూ, వెనక్కు తిరిగి మెల్లిగా 'వల్లీ! కాఫీ తీసుకురా' అన్నాడు. అమృతవల్లికి హృదయభారం ఎంతో తగ్గిపోయినట్లనిపించింది. భర్త పిలుపులో ఎంతో ఆప్యాయత, ప్రేమ, తొణికిసలాడినాయి. ఇట్టే కాఫీ తీసుకువచ్చి భర్తప్రక్కనే నిలబడింది. పమిట బాగా లాగి ఒళ్ళంతా కప్పేసుకుంది. తలకొంచెంగా వంచేసుకుంది. అయితే కళ్ళుమాత్రం పైకి చూడటానికే తహతహ లాడుతున్నాయి. కళ్ల

కాటిక మొహంమీదికి కొంచెంగా సాగింది. కను బొమ్మలుపైకి క్రిందకు ఎగురుతున్నాయి. ఆ సన్నటి నుదురుమీద చిన్నటిబొట్టు చాలా అందంగా కనిపిస్తోంది. కనిపించీ కనిపించని ఆబుగ్గసొట్ట ఆమెనవ్వుతో పాటు కనిపిస్తూ ఇట్టే మాయమయిపోతోంది. ఆసన్నటి పొడుగాటిముక్కు ఆమె మొహంలోకి ఎంతోతీరుగా వచ్చి కూర్చుంది. పొడుగాటి మొహం ఆమెఎత్తుకు ఎంతో ఆకర్షణగా కనిపిస్తోంది. వయ్యారంగా కాఫీకప్పును పట్టుకుని కదలక మెదలక నిలబడి పోయింది.

'కాఫీ తీసుకోండి' అంటూ శ్రీధర్, చంద్రానికి అందిచ్చాడు. 'అక్కర్లేదులెండి' అంటూనే చంద్రం అందుకున్నాడు.

ఆయన మాటలకు నవ్వొచ్చినా కూడా అమృతవల్లి మూతిబిగించుకునే నిలబడి వుంది. శ్రీధర్ మొహంలో అప్రయత్నంగా చిరునవ్వు తాండవ మాడింది. ఇద్దర్నీ చూస్తూ ఆమె తనను మరిచే పోయింది.

'మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుణ్ని ...' అంటూ కాఫీకప్పు క్రింద పెట్టేశాడు.

అమృతవల్లి సిగ్గుపడి తలవంచుకుని లోపలికి వెళ్లి పోయింది.

'ఇంటర్వ్యూకన్నారు ఏ ఉద్యోగానికి...' శ్రీధర్ చొరవచేసుకో దలుచుకున్నాడు.

చంద్రం పకపక నవ్వాడు.

'ఈ ప్రశ్న మీరు నన్నే వేస్తారనుకున్నా ... అసలు ఉద్యోగానికి వచ్చానని చెప్పిన తర్వాత, ఆ వివరాలు చెప్పాలసినబాధ్యత నామీదే వుంది. కాని నాకు చెడ్డ బిడియం. నేను ఉద్యోగం చేస్తున్నట్లు ఎవ్వరికీ తెలియకూడదని నా అభిమతం. అందాకా ఎందుకు నాకు ఉద్యోగం అంటే ఇష్టంలేదు. నేను ఈనాడు ఇక్కడకు వచ్చానంటే నాభార్యను సంతోషపెట్టటానికే. ప్రతివాడు ఏదో ఉద్యోగంచేస్తుంటే, మీరు ఊరికే ఇంట్లో కూర్చుంటారేమిటి అంటూ ఒక టేపోరు. ఆబాధపడలేక కొన్నాళ్లబాటైనా నేను కూడా ఒక ఉద్యోగస్థుణ్నే అనిపించుకుందామని చక్కా వచ్చేశాను. ఇలాంటి కిష్టపరిస్థితుల్లో నేను ఫలానా దానికి వచ్చానని చెప్పటంవలవ నాకు సంతృప్తివుండదు. మీకు సంతోషమూ కలగదు. అందువలన...' చంద్రం ఇంకా తనధోరణిలోనే సాగబోతున్నాడు.

'ఈ ఉద్యోగానికి వెనక ఇంత అగాధమైనచరిత్ర వుందని నాకు తెలీదుసుమండీ...' శ్రీధర్ బాగా చొరవ చేసుకున్నాడు.

'అబ్బో! చాలాబాగా అన్నారే!...' చంద్రం పకపక నవ్వాడు. లోపల్నుంచి భర్తమాటలు వింటున్న అమృతవల్లి తెగ మురిసిపోయింది. ఇంత నాజూకుగా తన భర్త మాట్లాడతాడని తనకు ఇంతవరకు తెలియనే తెలియదు. చీదరింపులు, విసుక్కోటాలు తప్ప తన భర్తనుగురించిన వివరాలు తెలియనే తెలియవు. అత్యంత మృగుహృదయమూ, చాలా సొంపుగా కూడా మాట్లాడకలడు. సున్నితమైన హాస్యం కూడా తెలుసు. అబ్బ! ఈవిధంగా నాతో మాట్లాడుతూ వుండరాదూ!-కాసేపు అమృతవల్లి బాధపడింది.

'ఇక మీరు శలవిస్తే...'

'అవును నాకూ టైమవుతోంది...'

చంద్రం మాటల్ని మనస్సులో నింపుకుని లోపలికి వచ్చేశాడు శ్రీధర్. ఎదురుగా చిరునవ్వు మొహం పెట్టుకుని అమృతవల్లి ఆకర్షణగా నిలబడాలన్నట్లు నిలబడిపోయింది. ఒక్కక్షణం తన మనస్సు తళుక్కుమన్నది. ఇట్టే శ్రీధర్ గిర్రున తల తిప్పేశాడు. ఆమె మనస్సు చివుక్కుమన్నది. మళ్ళీ మాట్లాడలేదు. ఏమిటో చిరాకు పడుతూనే వున్నాడు. కొనరాకుండా బాధపడుతూనే వున్నాడు. అమృతవల్లి ఓ మూల సతమతమయి పోతోంది. ఇద్దరూ కూడా తలో రకంగా బాధపడుతూనే వున్నారు. గబ గబ రెండు మెతుకులు నోట్లో వేసుకున్నాడో లేదో, చరచర వెళ్లిపోయాడు శ్రీధర్. వెళ్ళిపోతున్న భర్తను దిగాలపడి చూస్తూ, గుమ్మం ముందు నిలబడిపోయింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి. ఒళ్ళు గజ గజ లాడింది. కళ్లు రెండూ పమిటకొంగుతో అద్దుకుంటూ వెనక్కు తిరిగింది. గదిలోంచి చంద్రం వచ్చేస్తున్నాడు. ఆయన్ను చూసి గబ గబ మొహం తుడుచుకుని బింకంగా కనిపించటానికి ప్రయత్నం చేస్తోంది.

వాకిటి తలుపులు దగ్గరగా వేసి నిలబడ్డాడు. ఓరవాకిలిగా వేసివున్న తలుపుచాటున అమృతవల్లి. చీరె చిరుగాలికి రెపరెప లాడుతోంది. చంద్రం రెండుకళ్లు టపటప కొట్టుకున్నాయి. ఒక్కక్షణం అగాధంగా ఆలోచించాడు.

'ఏమండీ!...' అన్నాడు ఆడగొంతుకతో. అమృతవల్లి ఉలిక్కిపడింది.

‘తాళం ఉంటే ఇస్తారూ!...తాళం వెయ్యాలని నా ఉద్దేశంకాదు. మీరు ఇక్కడ ఉన్న తర్వాత మా ఇల్లు తాళం వెయ్యకపోతే మాత్రం యేం! అయితే మమ్మల్ని మా యిల్లుకూడా కాపలా కాయమని చెప్పటం నాకేమాత్రం ఇష్టంలేదు. ఇది సభ్యతాలక్షణం కాదు. నాకు తెలుసు...’ చప్పున చంద్రం ఆపేశాడు.

అమృతవల్లికి ఏమి మాట్లాడాలో అర్థంకాలేదు. ఏదైనా సమాధానంగా మాట్లాడాలని ఉబలాటపడిందే కాని ధైర్యం చాలలేదు. ఇరకాటంలో పడ్డట్లయింది. ఏమీ తోచలేదు. ఆలోచన తెగక చప్పున లోపలికి వెళ్ళి తాళం తీసుకువచ్చి గుమ్మంలో పెట్టేసింది.

తాళాన్ని చూసి చంద్రం నవ్వాడు. తలుపులు రెండు బిగువుగాలాగి తాళం వేసేశాడు. వెళ్లొస్తానని చెప్పాలనుకున్నాడు. ఆ క్షణంలో తనభార్య జ్ఞాపకం వచ్చింది. ఎప్పుడు వాకిట్లోకి వెళ్ళినా తనభార్యతో వెళ్లొస్తానని చెప్పటం చంద్రానికి బాగా అలవాటు. అంగువల్లనో ఏమో మన స్సొప్పలేదు. చేతులు ఊగించుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అమృతవల్లి వాకిట్లోకి వచ్చి చంద్రాన్ని చూస్తూ అట్లాగే నిలబడిపోయింది. కాస్తదూరం వెళ్ళి చివాలున చంద్రం వెనక్కు తిరిగాడు. గభాలున అమృతవల్లి లోపలిక వెళ్లి తలుపు వేసుకుంది. చంద్రం నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ భర్త ఆఫీసునుంచి వచ్చేదాక, ఆమెకు ఏవిధమైన కాలక్షేపమూ లేదు. కాసేపు ఏమీ తోచకపోతే ఏదైనా పుస్తకం పట్టుకుకూర్చుంటుంది. ఇవ్వాళ ఎందుకనో పుస్తకం చదవాలనే ధ్యాస పోనేపోలేదు. ఎంతసేపటికీ తనభర్తను గురించిన ఆలోచనలే! మధ్య మధ్య మాత్రం చంద్రం వచ్చి తొంగి చూసి పోతున్నాడు. ఎందుకు తన ఆలోచనల్లోకి చంద్రం వస్తున్నాడా అని ఆరాటపడింది. ఎంత ఆయనమాట తలుచుకోకుండా వుండాలన్నా, చంద్రం వస్తూనే వున్నాడు. చాలా విసుగ్గాలేచి గట్టిగా కళ్లుమూసుకుంది. అప్పటికీ చంద్రం తన ముందు నిలువునా నిలబడినట్లుగానే కనిపిస్తున్నాడు. అబ్బ! ఏమిటి ఇదంతా అనుకుంటూ తెగబాధపడుతోంది. ఒక్క క్షణంసేపైనా మరిచేపోవాలని ప్రయత్నంచేసినా వీలుపడటంలేదు. ఏమిటో వింతగా ఆలోచన మెదలుపెట్టింది. బాగా అలసిపోయి చప్పగా నిద్రపోయింది.

శ్రీధర్ వచ్చి, వచ్చీ వరండాలో కుర్చీలో కూర్చున్నాడు. భర్త వచ్చినట్టే తెలీదు అమృతవల్లికి. లోపలే వుండిపోయింది. అవతల గది చప్పుడయినట్టు వినిపిస్తే దభాలున వాకిట్లోకి వచ్చింది. భర్త కుర్చీలో కూర్చుని వున్నాడు. చప్పున ఉలిక్కిపడింది. ఏమి మాట్లాడటానికి తోచలేదు ఆక్షణంలో.

తడబడుతూ ‘ఎప్పుడొచ్చారు?’ అంటూ భర్తదగ్గరకు వెళ్లింది. శ్రీధర్ కోరచూపు చూశాడు.

‘మీరు వచ్చినట్టు నాకు తెలీదండీ నిజంగాను..’ ఏదో పెద్ద తప్పయినట్లు ప్రాధేయపడింది.

‘ఏమండీ! నాతో మాట్లాడండి!...’

సమాధానం లేదు.

గబ గబ లోపలికి వెళ్లి కాఫీ తీసుకువచ్చింది. ఇవ్వాళ ఏమనుకున్నాడో ఏమో కాఫీ తీసుకున్నాడు శ్రీధర్.

‘పంచదార చాల్లేదు’ అన్నాడు.

ఎంత తియ్యగావుంది ఈమాట - అనుకుని పంచదార తిసుకువచ్చింది.

‘ఇప్పుడు కాఫీ బాగుందండీ!...’ కళ్లల్లో కళ్లు పెట్టి అడిగింది. శ్రీధర్ కొంచెం చలించినట్లయిపోయాడు.

‘ఊ...’ అంటూ బిగువుగాను, బింకంగాను అన్నాడు.

‘అబ్బ! ఈకాస్తయినా మాట్లాడారు’ అనుకుంది లోపల.

శ్రీధర్ మనస్సులో అలజడి బయలుదేరింది. తన ఆలోచన భార్యమీదకు మళ్ళింది. ఆమెమొహం చూస్తుంటే తీవ్రమైన అసంతృప్తి వెంటాడుతోంది. ఎంగుకు పెళ్ళిచేసుకున్నట్లు అనే ప్రశ్న మళ్లీ ఇంకోసారి తనలో తాను వేసుకున్నాడు. నాకు ఇష్టంలేని పెళ్ళి అని మళ్లీ గొణుక్కున్నాడు. అంతర్ఘర్షణలో పూర్తిగా అలసిపోయాడు. అబ్బ అనుకుని తల పట్టుకుని కళ్లు మూసుకున్నాడు.

‘ఏమండీ తలనొప్పిగా వుందా?...’ నుదురుమీద చెయ్యిపెట్టి అన్నది.

‘ఏం లేదులే! నువ్వెళ్లు!...’ గట్టిగా కసురుకున్నాడు. బిక్కమొహం వేసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

తలుపులు తెరుచుకుని చంద్రం నిలువునా నిలబడ్డాడు. కుర్చీలో కూర్చున్న శ్రీధర్ తన కళ్ళల్లోకి వచ్చాడు. హఠాత్తుగా ఒక ఐడియా వచ్చేసింది. చిటిక వేశాడు. చివాలున లోపలికి వెళ్లాడు. కాగితాలబొత్తి

తీసుకువచ్చాడు. అప్పటికే శ్రీధర్ కళ్లుతెరిచి చంద్రం లోపలికి వెళ్లటం చూశాడు. ఇద్దరూ ఒకర్ని చూసి ఒకరు చిరునవ్వుమొహం పెట్టుకున్నారు. చంద్రం గబగబ దగ్గరకువచ్చి పక్కన కుర్చీ లాగేసుకున్నాడు.

‘కాఫీ తీసుకురా’ అన్నాడు శ్రీధర్.

క్షణంలో ప్రత్యక్షమయింది కాఫీ తీసుకుని అమృతవల్లి.

‘కాఫీ చాలా బాగుందండీ...’ గుటకలు వేస్తూ అమృతవల్లి మొహంవైపుకు చూశాడు. ఆమె తలవంచేసుకుంది.

‘చూడండి! మీకు నా రచన చదివి వినిపించాలనుకుంటున్నాను. మీరు కాస్త తీరుబడిగా వున్నట్టున్నారు... కాస్త ఓపికపడతారా!...అయినా నేను రాసేది ఎవరికి? మీబోటి రసికులకు. మీరే కనక విని ఆనందించకపోతే నేను రాయటం వృధా. అయితే నాఅంతట నేనుగా వచ్చి నా రచన వినమని కోరటం నా గౌరవానికి భంగం కలుగుతుందని నేను ఎన్నడూ భావించను. నాకు అలాంటి దురభిమానంలేదు...’ చంద్రం గళమెత్తాడు.

అమృతవల్లి తలుపుచాటున నిలబడి పొంచి చూస్తోంది శ్రీధర్ ఏమంటాడో అన్నట్లు. చంద్రం ఆయన మొహంలోకి చూశాడు. అతను చిరునవ్వు నవ్వాడు.

‘మీ నవ్వుయొక్క ఆంతర్యం ఏమిటి?’ అని ప్రశ్నించాడు చంద్రం.

‘అంతభావాన్ని పెట్టుకుని నవ్వే అలవాటు నాకు లేదు. అన్నాడు చాలా స్వాతికంగా శ్రీధర్.

మంచి సమాధానం చెప్పారులెండి!...’ చంద్రం నవ్వుగా మార్చేసుకున్నాడు.

‘నేను అందుకుకాదు అన్నది. ఇవ్వాళ రాత్రి కూడా బ్యాంకుకు వెళ్లాలి. నాకు ఎక్కువ టైము వుండదేమోనని...’ మాటలు చప్పరించాడు శ్రీధర్.

‘దాని కేముంది. డ్యూటి ముఖ్యం. ఇవ్వాళ కాకపోతే రేపు చదివి వినిపిస్తాను. దానికి నేనేమీ అనుకోనులెండి!...’తన చేతిలో కాగితాలు చూస్తున్నాడు.

అవి చదువుతుంటే మనస్సు చలిస్తోంది. తాను సృష్టించిన వ్యక్తులు తన కళ్ళఎదుట నిల్చి, తనకు తీవ్రమైన అన్యాయం జరిగిందని పోట్లాడుతున్నారు.

నేను మీకు ఏవిధమైన అన్యాయం చెయ్యలేదు. మీరు ఆవిధంగానే పుట్టారు. ఆవిధంగానే చచ్చిపోతారు...మీ జీవితాల్లో చెప్పుకోతగ్గ మార్పులేమీ రావు... చంద్రం వాళ్లతో తీవ్రంగా ఘర్షణ పడుతున్నాడు.

ఇట్టే శ్రీధర్ వంక చూశాడు. అతను కుర్చీలోంచి లేవబోతున్నాడు.

‘చూడండి! ఈ శకుంతలకు నేను ఏమన్యాయం చేశాను? మీరు చెప్పండి...భర్తను మెప్పించలేక ఆయన తనమీద ప్రేమగా వుండటంలేదని వాపోతోంది. అసలు ఈఆడవాళ్లు...’ శ్రీధర్ వాలంకంచూసి చప్పున తగ్గాడు.

శ్రీధర్ అమృతవల్లివైపుకు తీక్ష్ణంగా చూశాడు. ఆమెకు చెడ్డగాభరా వేసింది. ఆమెకూడా కళ్లార్పకుండా అట్లాగే చూస్తోంది. చంద్రం అప్రయత్నంగా ఆమె మొహంలోకి చూశాడు.

ఆహా! ఏమందం! స్త్రీమూర్తంటే ఇలాగే వుండాలి. ఆజానుబాహులురాలు. పొడవైన వేళ్లు చిన్న మొహం. తీక్ష్ణమైన కళ్ళు. పల్చటి పెదిమలు. కనుబొమ్మలు రెంటినికలిపే గుండ్రటి తిలకం. ఎత్తరి విగ్రహం. సన్నటినడుము. నిజంగా నేను సృష్టించదలుచుకున్న స్త్రీమూర్తి నాకు సాక్షాత్కరించింది - అనుకున్నాడు. హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

శ్రీధర్ అదోరకంగా చంద్రంవంక చూశాడు. ఇద్దరూకూడా ఎవరి మనస్సుల్లో వాళ్ళు అసంతృప్తి పడ్డారు.

ఒకటిరెండు రోజులు ఇద్దరూకూడా ముభావంగానే వుండిపోయారు. అమృతవల్లిమాత్రం ఏమిటా కారణం అని ఆలోచించటం మొదలుపెట్టింది. భర్తను అడుగుదామని తటపటాయిస్తుంది; మళ్లీ ఏమనుకుంటాడో అని వెనక్కి జంకుతుంది.

ఓనాడు సాయంత్రం చంద్రం తన గదివైపుకు వెళుతూవుండగా శ్రీధర్ ఎదురుగావచ్చి ‘మీ ఆడవాళ్లు ఎప్పుడు వస్తారు?’ అని అడిగాడు హఠాత్తుగా.

చంద్రం నివ్వెరబోయి నిలబడిపోయాడు. క్షణంలో నవ్వుతెచ్చుకున్నాడు.

‘అసలు నేనే అవిషయము చెపుదామనుకున్నాను. నాభార్య అంత ఆరోగ్యవంతురాలుకాదు...అయితే ఏం నాదగ్గర వుండక ఇంకెక్కడ వుంటుంది? అందుకనే కాస్త ఓపికరాగానే వెంటనే బయలుదేరి రమ్మని రాసేశాను. అయినా నేను ఒక్కణ్ణివున్నా కుటుంబంతో వున్నట్టే లెక్క. మీరు ఏమాత్రం సందేహ

పడక్కర్లేదు. నేనుమాత్రం ఎన్నాళ్లని హోటల్లోపడి తినగలను. నాశరీరంకూడా అంత దృఢమైనదేం కాదు...మీకు ఏవిధంగానూ కూడా ఇబ్బంది కలుగ చెయ్యనని హామీ యిస్తున్నాను...' చంద్రం ఇంక తనను సమర్థించుకోవటంలో పడిపోయాడు.

'అందుకు కాదు నేనన్నది...' శ్రీధర్ తాను అడిగిన ప్రశ్నకు అర్థం చెప్పబోతున్నాడు.

'ఏమైనా కాని నేనుమాత్రం మా ఆడవాళ్లని తెచ్చి తీరతాను...' చంద్రం నిశ్చయంగా చెప్పేశాడు.

లోపలికిపోయి తాపీగా కూర్చున్నాడు చంద్రం. బుర్రనిండా ఎప్పుడూ ఏవో ఆలోచనలే. క్షణం ఊరికే కూర్చోడు. ఎవర్నో ఒకర్ని గురించి, ఏదో ఒక విషయాన్ని గురించి మనస్సులో చర్చ జరుగుతూ వుండాల్సిందే! అందులో ఈ ఊరు వచ్చినప్పటినుంచి అతని మనస్సు ఎలాగో ఉంది. ఆలోచనలు ఎదురెదురుగా వచ్చి ఒకదాన్ని ఒకటి ఛేదిస్తున్నాయి. నిలకడగా ఆలోచించటం కుదరటంలేదు. తనకున్న సమస్యతోపాటు ఇంకో క్రొత్తరకపు సమస్య ఎదురయి కూర్చుంది. తాను వచ్చినప్పటినుంచి ఓకంట కనిపెడుతూనే వున్నాడు. ఏదో తెలియని మనస్పర్థ శ్రీధర్ కు అమృతవల్లికి మధ్య కనిపిస్తూనేవుంది. కారణం ఇదమిత్థమని ఊహించలేకపోతున్నాడు. ఒకటిమాత్రం నిశ్చయం. భార్యాభర్తలమధ్య పొరపులు ఉన్నాయి. వాళ్ళ సంసారజీవితం సాఫీగా సాగిపోవటంలేదని మాత్రం గట్టిగా తెలుసు.

పాపం అమృతవల్లి పూర్తి అమాయకురాలు. భర్త ప్రేమకోసం నిత్యం నిరీక్షిస్తూ వుంటుంది. కాని శ్రీధర్ ఆమె విషయము పట్టించుకోనట్లే ప్రవర్తిస్తూ వుంటాడు. అప్పుడప్పుడు భార్యాభర్తల మధ్య ఘర్షణ చంద్రానికీ వినిపిస్తూనే వుంటుంది. హఠాత్తుగా ఒక గంభీరమైన ఐడియా తట్టింది. కాగితం కలం పట్టుకున్నాడు. బరబర వ్రాసేశాడు.

శ్రీధర్ కూడా కొంచెంగా బాధపడ్డాడు. అంత ఇదిగా చంద్రాన్ని ఎందుకు అడిగానా అని. గదిలోంచి బైటకు వస్తాడేమో, ఏమైనా మాట్లాడదామన్నట్లు కాపలాగా కూర్చున్నాడు. ఎంతసేపటికి చంద్రం బయటకు రానేలేదు. శ్రీధరే తలుపుతట్టాడు. చంద్రం తలుపు తీశాడు.

'ఇవ్వాళ మీరు భోజనం...' అంటూ శ్రీధర్ మాట్లాడటం ప్రారంభించాడు.

'ఇవ్వాళ శుక్రవారం...' అన్నాడు చంద్రం హఠాత్తుగా. శ్రీధర్ మూగవాడయి నిలబడిపోయాడు.

'మీ రేదో రాసుకుంటున్నట్టున్నారు...' క్షణం ఆగి మళ్ళీ శ్రీధర్ అన్నాడు.

'అవునవును...క్రొత్తనవల ఒకటి ప్రారంభించాను లెండి!...'

'మిమ్మల్ని అనవసరంగా డిస్టర్బు చేశానను కుంటా?...'

'అబ్బే! అలాంటిదేమి లేదు...ఎంత మందితోనైనా మాట్లాడుతూ వుంటా. ఎన్ని విషయాలైనా వింటూనే వుంటా. అయితే నాధోరణి నాదే..లేకపోతే మాబోటి రచయితలకు మహాకష్టం. ఒక్క లైనుకూడా రాయలేము చూడండి......అందాక ఎందుకు నేను క్రిందటిసారి నవల రాసినప్పుడు, పిల్లలు ఒకటే రణగొణ ధ్వని. చుట్టుప్రక్కలవా రందరూ వచ్చేసి నాసహనాన్ని పరీక్షించేశారు. ప్రక్కింటివాళ్లింట్లో ఒక రోగిష్టివా డుండేవాడు.ఆయనబాధ చెప్పటానికి వీల్లేదు. పైపెచ్చు మాయింటికి వచ్చిన చుట్టాలు ఒకటే గోల. ఆమాటలకు అంతూ పొంతూ వుండదు. మాది వీధిమీద ఇల్లేను. ఇంకా ఆజాతర చెప్పటానికి వీల్లేదు. ఇన్నింటి మధ్య కూర్చుని నవల పూర్తిచేశాను. అయితే ఆ వాతావరణం గురించే రాశాను లెండి...'

'తలుపేసుకోండి... నే వస్తా'...శ్రీధర్ వెనక్కు తిరిగాడు. చంద్రం మళ్లీ కాగితాలముందు కూర్చున్నాడు. రాత్రి ఎంత ప్రొద్దుపోయిందో తెలియనే లేదు. తెలతెలవారుతుండగా పడుకున్నట్టున్నాడు. తొమ్మిదయినా తలుపులు తెరవలేదు. ఒకటి రెండు సార్లు శ్రీధర్ గదిదగ్గరకు వచ్చికూడా పస్తాయించి వూరుకున్నాడు.

చంద్రం బద్ధకంగా నిద్రలేచి, ఆవలించి, ఒళ్లు విరుచుకుని, నానా హంగామా చేశాడు. నిమిషాలమీద డ్రస్సు వేసుకుని చకచకా వాకిట్లోకి వెళ్లిపోయాడు. మళ్లీ రెండు మూడు రోజులదాక చంద్రం, శ్రీధర్ తరుచు కలుసుకోవటం కూడా జరగలేదు.

కుటుంబంతో వుంటానని చెప్పి, ఒంటరిగానే వుంటున్నాడే అని మథనపడుతున్నాడు శ్రీధర్.

అడుగుతే ఏవో కారణాలు చెప్పతాడన్నమాటే గాని అసలు విషయం చెప్పనే చెప్పడు. ఈయన ప్రకృతి అంతా అదో తమాషాగా వుంది. ఈయన

ఎలాంటి రకమో కూడా తెలియటంలేదు. లేనిపోయింది తెచ్చిపెట్టుకున్నాను. ఇవ్వాళ వెళ్ళిపొమ్మంటే బాగుంటుందా! బాగుండటంమాట తర్వాత సంగతి. అసలు వెడతాడా అని. క్షణంపాటు తనదృష్టి అమృతవల్లిమీదకు మళ్లింది. ఆమెనుగురించి రకరకాలుగా ఆలోచించుకుంటున్నాడు. క్షణంలో పెద్దపెట్టున కోపం తామసం వచ్చి ఆవహించేస్తున్నాయి. మరుక్షణంలో మామూలుమనిషయి కూర్చుంటున్నాడు. మొత్తంమీద శ్రీధర్ మనస్సులో తీవ్రమైన కలవరం బయలుదేరింది.

ఆ తీవ్రతతోనే లోపలికి వెళ్లాడు. కళ్లు పెద్దవి చేసి భార్య మొహంలోకి చూశాడు.

'నిన్న సాయంత్రం చంద్రంగారు ఏమిటి నీతో మాట్లాడుతోంది!' అన్నాడు శ్రీధర్.

'నాతోనా!...నాతో ఏం మాట్లాడాడు?...'

'లేకపోతే నాతోనా మాట్లాడింది!...'హుంకరించాడు.

'నాకేమి అర్థం కావటంలేదు...నాకేం తెలీదు. నేను ఆయనతో అసలు మాట్లాడందే!...'

'ఊ!... నేను కళ్లారా చూసినా కూడా...'

'ఏం చూశారు...'

'మనగది గుమ్మందగర నిలబడి...'

'అదా! ఎప్పుడూ ఆయన అంతే! ఏదో తనలో తాను అనుకుంటూనే వుంటాడు. కథ రాశాడుట. అది బిగ్గరగా చదువుకుంటున్నాడు. నాతో ఎక్కడ మాట్లాడాడు...'

ఇంతలోనే చంద్రం గదితలుపులు తెరిచి బైటకు వచ్చేశాడు.

'సమయానికి మీరు ఇక్కడే వున్నారు... ఎప్పుడు అవకాశం దొరుకుతుందా అని కాచుకు కూర్చున్నాను...' కాగితాలు తీశాడు.

'ఇది ప్రేమికుల మనస్తత్వాన్ని నిశితంగా, సూక్ష్మంగా చిత్రించిన కథ. వింత ప్రకృతులమధ్య నలిబిలయి, ఒకర్నొకరు అర్థం చేసుకోలేక, వృథాగా తమ తమ యౌవనాన్ని కాలానికి బలిచేసి, తీరిగ్గా పశ్చాత్తాప పడ్డ ఇద్దరిగాథ.

'ఒకరిలో లేని గుణాన్ని మరొకరు పూరించి, ఇద్దరూ కలిసి ఒకే పూర్ణవ్యక్తిగా మెలగాలి. ఇదే భార్యాభర్తల అనుబంధం, అనురాగం. భార్యాభర్తలు ఒకర్నొకరు ఆకర్షిస్తూ వుండాలి. ప్రతి వ్యక్తికి హృదయం వుంటుంది. మనస్సుంటుంది. ఆమె మనస్సు ఆరాటపడుతూ వుంటుంది. ఆయన హృదయం పరితపిస్తూ వుంటుంది. ఆమె ఆరాటానికి అతను సమాధానం చెప్పాలి. ఆయన పరితాపానికి ఆమె ఉపశాంతిగా ఉండాలి...' చప్పున చంద్రం ఆపేశాడు.

'ఏమిటండీ అట్లా చూస్తున్నారు నావంక...' శ్రీధర్ మొహంలోకి నిశ్చేష్టుడయి చూశాడు.

'అబ్బే! ఏంలేదు!...' అంటూ దభాలున ఉలిక్కిపడ్డాడు శ్రీధర్.

చంద్రం మాటలు వింటుంటే, శ్రీధర్ మనస్సు అదోలాగున అయిపోయింది. ఎక్కడికో పోయి ఏదో ఆలోచిస్తోంది. చంద్రం పలకరించేటప్పటికి మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చిపడ్డాడు శ్రీధర్.

లోపల్నుంచి ఆదుర్దాగా వింటున్న అమృతవల్లికి హృదయభారం తగ్గినట్లనిపించింది. తనకు తెలియని ఆనందం తనను చుట్టుముట్టేసింది. ఆమె కళ్ళనుంచి జలజల నీళ్లు క్రిందపడ్డాయి. అప్రయత్నంగా కళ్ళు తుడుచుకుంటూ ఆవేశంగా ఆలోచిస్తోంది.

శ్రీధర్ తల గిర్రున తిరిగిపోతోంది. చంద్రం ఇంకా ఏమంటాడో అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్నాడు.

'మీరు ఏమిటోగా వున్నారు. మిమ్మల్ని బాధ పెట్టదలుచలేదు. ఇంకోనాడు చదువుతాను లెండి...' అంటూ చంద్రం లేచాడు.

'అబ్బే! ఏం లేదులెండి !...' అంటూ మాటవరసకు శ్రీధర్ అన్నాడు. చంద్రానికిమాత్రం మనస్సు ఒప్పలేదు. వెళ్లిపోయాడు.

ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయేదాక శ్రీధర్ ఇంటికి రానేలేదు. అమృతవల్లి అంట్లో ఒక్కత్తి కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమెలో ఏదో చెప్పలేని బాధ ఏర్పడింది. దుఃఖము పొర్లుకొస్తోంది. ఏంచెయ్యాలో అర్థంకావటం లేదు. ఉద్వేగం హెచ్చిపోతోంది.

చంద్రం అయితే ఓమూల వ్రాసుకుంటూ కూర్చున్నా, పక్క గదిలో అమృతవల్లి ఏంచేస్తోందో అనే ఆలోచనమాత్రం వెనువెంటనే వుంది. ఒక చెవి, ఒక కన్ను అటు అప్పచెప్పే వుంచాడు, తెగమథన పడు

తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో తన కర్తవ్యం ఏమిటో అని బోధపడక తీవ్రంగా కలవరపడిపోతున్నాడు.

శ్రీధర్ మెల్లిగా, బరువుగా వచ్చి వచ్చీ గుమ్మం దగ్గర నిలబడ్డాడు. లోపల అమృతవల్లి ఏంచేస్తోందో చూడాలని చాలా ఉబలాట పడుతున్నాడు. కొంచెం కొంచెంగా నిట్టూర్పు వినిపిస్తోంది. శ్రీధర్ హృదయం కదిలిపోయింది. గజగజ క్షణంపాటు వణికిపోతాడు. తత్తరపడిపోయాడు.

'తలుపు' అంటూ మెల్లిగా తట్టాడు.

చప్పున కళ్లుతుడుచుకుని గద్గదకంఠాన్ని కప్పి పుచ్చటానికి ప్రయత్నంచేస్తూ వచ్చి తలుపుతీసింది వల్లి. ఎదురుగా భర్త నిలబడివున్నాడు.

'ఇంత ఆలస్యమయిందే...' అంటూనే పెదిమ కరుచుకుని దుఃఖము ఆపుకోలేక గిర్రున వెనక్కు తిరిగింది. శ్రీధర్ నోట మాటలేదు. వెనకాలే నడిచాడు. యాంత్రికంగా లోపలికి వెళ్ళి మంచంమీద ఒరిగాడు. అమృతవల్లి కూడా మెల్లిగా మంచందగ్గరకు వచ్చి నిలబడింది.

శ్రీధర్ కు ఆవేశం హెచ్చిపోతోంది. అయితే అభిమానం అడ్డం వస్తోంది. ఈ రెంటిమధ్య సతమతమయిపోతున్నాడు. లోపల లోపల వల్లీ వల్లీ అనుకుంటున్నాడు. ఏదో చెప్పాలని తాపత్రయపడుతున్నాడే కాని, మాటలు పెగిలి పైకిరావటంలేదు. అస్పష్టంగా ఏవో మాటలు అంటున్నాడు. వల్లి పెదిమలుకూడా తడబడుతున్నాయి. ఇక శ్రీధర్ నిబ్బరంగా వుండలేకపోయాడు. అమాంతం మంచమీదనుంచి లేచాడు.

'వల్లీ !...' అంటూ గట్టిగా అమృతవల్లిని కౌగలించుకున్నాడు. ఆమె భర్త బాహుబంధాల్లో కరిగిపోయింది.

చంద్రానికి అస్పష్టంగా కొంచెం తెలిసింది. వల్ల అనేమాట చెవుల్లో గింగురుమంది. అనుకోకుండా చంద్రం తడబడ్డాడు. ఏదో తెలియని అనందం అతన్ని ఆవహించింది. కళ్లు క్షణంలో చెమ్మగిలినాయి. ఆపుకోలేనంత ఆవేశంవచ్చి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఏవో రకరకాల ఆలోచనలు వచ్చేసి అతన్ని విపరీతంగా కలవరపెట్టేశాయి. వ్రాస్తున్న కాగితాలన్నీ తీసేసి కట్టకట్టేశాడు. గబగబ బెడ్డింగు చుట్టేశాడు. డ్రెస్సు వేసుకున్నాడు. ఒకసారిమాత్రం అమృతవల్లిని శ్రీధర్ ను చూడాలని, అతని కళ్ళు తహతహలాడినాయి. కాని స్పష్టంగా కనబడలేదు. దూరాన్నుంచి అస్పష్టంగా చంద్రానికి కనిపించారు. వాళ్ళిద్దరు ఒక టయ్యారు అని పెద్ద నిట్టూర్పు విడిచాడు.

భళ్లున తెల్లవారింది.

శ్రీధర్ కు ఎందుకనో వెంటనే చంద్రాన్ని చూడాలనిపించింది. చంద్రానికి తాను ఎంతో ఋణపడివున్నానని అనుకున్నాడు. ఎట్లాగైనా తన కృతజ్ఞతలు చెప్పుకోవాలని తహతహ లాడిపోయాడు. అమృతవల్లి లోపల కోర్కెను దాచుకోలేకపోయింది. ఆవేశాన్ని ఆవేదనను పైకి చెప్పుకోలేక పోయింది.

'ఏమండీ! చంద్రంగారికి కూడా కాఫీయిస్తాను" అంటూ తెగ ఆయాసపడిపోయింది.

'అవును ఆసుకురా!' అన్నాడు చప్పున శ్రీధర్.

ఇట్టే ఇద్దరు చంద్రం గదిముందు నిలబడ్డారు. గది తలుపులు బార్లగా తీసివున్నాయి. అక్కడ ఒక కాగితం పడివుంది.

శ్రీధర్ చప్పున కాగితం తీసిచూసుకున్నాడు.

'మా ఆడవాళ్ళు ఇప్పట్లో వచ్చేటట్టు లేరు. నేను ఇక్కడ ఒంటరిగా వుండి మిమ్మల్ని బాధపెట్టటం నాకేమాత్రం ఇష్టంలేదు. మీరుచూపిన ఆదరాభిమానాలకు సర్వదా కృతజ్ఞుణ్ణి. ఆదర్శదంపతులైన మీకు నా శుభాకాంక్షులు.'

చంద్రం.